సాక్షి
అనంతపురం

ఆదివారం । 26 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి స్వాగతం



హైకోర్టు జడ్జికి పూలమొక్క అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం సెంట్రల్: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం అడ్మినిస్ట్రేషన్ జడ్జి కె.శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాకు వచ్చారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయనకు జిల్లా జడ్జి శ్రీనివాస్, జేసీ శివ్ నారాయణ్ శర్మ ఘన స్వాగతం పలికారు. అలాగే కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, సీనియర్ న్యాయవాది బి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు హైకోర్టు జడ్జిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

అవార్డు అందుకున్న ఎస్పీ



అవార్డు అందుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పనితీరు కనబరిచిన ఎస్పీ పి. జగదీష్‌కు అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా జగదీష్ పనిచేశారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన.. యువకునికి దేహశుద్ధి

తాడిపత్రిటౌన్: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడికి దేహశుద్ధి చేశారు. వివరాలు.. పట్టణంలోని పోరాట కాలనీకి చెందిన మహబూబ్‌బాషా.. అదే కాలనీలోని విద్యార్థినులతో రోజూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. శనివారం కూడా స్కూల్ నుంచి వస్తున్న బాలికలను ఏడిపించాడు. దీంతో బాలికలు తమ తల్లిదండ్రులతో చెప్పుకుని విలపించగా.. ఆగ్రహం చెందిన వారు మహబూబ్ బాషాను చితకబాదారు. నిందితుని తల, చేతులకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహబూబ్ బాషాపై బాలికల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

'దొంగ ఫ్రెండ్'కు ఎండ్‌కార్డు

తాడిపత్రిటౌన్: తాను మీ పిల్లాడి స్నేహితుడినంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి డబ్బు లాగుతున్న కేటుగాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. తాడిపత్రిలోని కేవీ రెడ్డి నగర్‌కు చెందిన షేక్‌మహబూబ్ బాషా ఇంటర్ మధ్యలోనే ఆపేశాడు. పట్టణంలో జులాయిగా తిరిగేవాడు. నిత్యం తాడిపత్రిలోని స్కూళ్ల వద్దకు వెళ్లేవాడు. విద్యార్థులను మాటల్లో ముంచి వారితోనే వారి తల్లిదండ్రుల సెల్ నంబర్లకు ఫోన్ చేయించేవాడు. తాను మీ అబ్బాయి స్నేహితుడినంటూ మాటలు కలిపేవాడు. పరీక్ష ఫీజుకు ఇంట్లో డబ్బులు ఇవ్వడం లేదని, అమ్మకు ఆరోగ్యం సరిగా లేదు.. ఆస్పత్రిలో ఉందని తదితర కారణాలు చెప్పి రూ.5 వేల నుంచి రూ. 15 వరకూ డబ్బు గుంజేవాడు. ఇటీవల పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లికి చెందిన ఓబిరెడ్డికి ఆయన కుమారుడు యశ్వంత్‌తో ఫోన్ చేయించాడు. అయితే, డబ్బు లేదని ఓబిరెడ్డి చెబితే యశ్వంత్‌ను ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తన వద్దే ఉంచుకున్నాడు. దీంతో ఓబిరెడ్డి చేసేది లేక రూ. 5 వేలను ఫోన్‌పే ద్వారా ముట్టజెప్పాడు. అనంతరం తాడిపత్రికి చేరుకొని కొడుకుతో మాట్లాడగా బాషా బాగోతం తెలిసింది. దీంతో ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా బాషాను గుర్తించిన పోలీసులు.. పుట్లూరు రోడ్డులో శనివారం అదుపులోకి తీసుకున్నారు.

ఏమైంది బాస్..!



జిల్లాకు కొన్ని నెలల క్రితం పోలీస్ బాస్‌గా జగదీష్ వచ్చారు. ఇప్పటి వరకూ ఎస్పీలుగా పని చేసిన వారిలో అందరికంటే వయసులో ఆయన చిన్నవారు. దీంతో ప్రజలు సంతోషించారు. ఉత్సాహం వచ్చింది. కుర్రాడు కాబట్టి దూకుడుగా ఉంటారు.. దొంగలు, కబ్జాకోరులను హడలెత్తిస్తారని ఆశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేస్తారని భావించారు. కానీ కూటమి సర్కారు పుణ్యమా అని సీను రివర్స్ అయింది. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పినా.. దొంగతనాలు, దురాక్రమణలు, హత్యలు తదితర ఘటనలు వరుసగా జరుగుతున్నా ఎస్పీ మౌనముద్ర వేస్తూ అన్ని వర్గాల నుంచి విమర్శలు మూటకట్టుకుంటున్నారు.

- ఖాళీ స్థలాలు కనిపిస్తే ఆక్రమణలకు దిగుతున్న 'పచ్చ' మాఫియా
- ఎస్పీ ఇంటికి కూతవేటు దూరంలోనే బార్‌లా తయారైన మద్యం షాపు
- దొంగతనాలకు కేరాఫ్‌గా జిల్లా
- పోలీసు స్టేషన్లలో ఆనవాయితీగా మారిన సివిల్ పంచాయితీలు
- అరాచకం రాజ్యమేలుతున్నా ఎస్పీ మౌనంపై విమర్శల వెల్లువ



అనంతపురం శివారు రాజహంస విల్లాస్‌లో ఇటీవల దొంగలు సృష్టించిన బీభత్సం (ఫైల్)

జిల్లా చరిత్రలోనే పెద్ద దోపిడీ..



నాలుగు రోజుల క్రితం అనంతపురం శివారులోని రాజహంస స్వీట్‌హోం విల్లాస్‌లో రూ.3.50 కోట్ల భారీ దొంగతనం జరిగింది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఇంత పెద్ద దోపిడీ జరిగింది లేదు. అయితే, పోలీసులు ఈ కేసులో ఇప్పటి వరకూ ప్రాథమిక ఆధారాలు కూడా సేకరించలేకపోయారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో ఖాకీల వైఫల్యంపై జిల్లావాసుల్లో అంతులేని ఆందోళన నెలకొంది. నాలుగు కాసుల బంగారం ఇంట్లో దాచుకుందామన్నా భయపడే పరిస్థితి దాపురించింది. ఇలాంటి ఘటనలు ఒకటీ, రెండూ కాదు పదుల సంఖ్యలో జరుగుతున్నా ఎస్పీ జగదీష్ కనీసం నోరు విప్పడం లేదన్న విమర్శలున్నాయి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో శాంతిభద్రతలు ఎంతలా అదుపు తప్పాయనేందుకు శుక్రవారం అనంతపురంలోని సోమనాథ్‌నగర్‌లో జరిగిన భూకబ్జానే ప్రత్యక్ష సాక్ష్యం. పట్టపగలే దుండగులు రెచ్చిపోయి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మనుషులమంటూ కర్రలు చేతబట్టుకుని భూమిని కబ్జా చేస్తే అడిగే నాథుడే లేరు. బాధితులు డయల్ 112కు ఫోన్ చేస్తే.. పోలీసులు ఘటనాస్థలికి వచ్చి బిరియాని తింటున్న రౌడీలను మాటమాత్రం మందలించకుండా స్టేషన్‌కు రమ్మన్నారు. ఆ తర్వాత అతీగతీ లేదు. ఇక.. అనంతపురంలో ఎస్పీ ఇంటికి కూత వేటు దూరంలో స్థానిక ఎమ్మెల్యేకు చెందిన రుద్ర వైన్ షాపు ఉంది. ఇక్కడ అనధికార పర్మిట్ రూమ్ నడుస్తున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అన్ని పోలీసుస్టేషన్లలోనూ సివిల్ పంచాయితీలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఏదీ పురో'గతి....?'

జిల్లావ్యాప్తంగా అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నా పోలీసులు పట్టనట్లే ఉంటున్నారు.



పట్టపగలే బార్‌ను తలపిస్తున్న అనంతపురం రామ్‌నగర్‌లోని రుద్ర వైన్స్

మేడం కూడా అంతే..

అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి కూడా ఎస్పీ బాటలోనే ఉన్నారా అనే విమర్శలున్నాయి. ఎన్నికల సమయంలో తాడిపత్రిలో అల్లర్లు జరగవచ్చన్న సమాచారం ఉన్నా చర్యలు తీసుకోలేకపోయారు. ఇటీవల జరిగిన ఘటనలను కూడా మేడం పెద్దగా పట్టించుకుని చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో డీఐజీ తీరుపై కూడా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- గతేడాది సెప్టెంబర్‌లో రాయదుర్గం నియోజకవర్గం హనకనహాళ్‌లో రాములోరి రథానికి దుండగులు నిప్పుపెట్టారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో ఆశించిన పురోగతి చూపలేదు.
- 3 నెలల క్రితం రాప్తాడు నియోజకవర్గ పరిధిలో రూ.60 లక్షల విలువైన గోవా మద్యం డంప్ దొరికింది. దీనివెనుక ఓ ఎమ్మెల్యే ఉన్నారని ప్రచారం నడుస్తోంది. ఈ కేసులో అసలు నిందితులెవరో ఇప్పటికీ తేలలేదు.
- జిల్లాలో గంజాయి మహమ్మారి జడలు విప్పింది. చాలా కాలేజీల్లో విద్యార్థులు గంజాయి సేవిస్తున్నా ఎక్కడా చర్యలు లేవు.
- గత 15 రోజుల్లో అనంతపురంలో ఒకటి, తాడిపత్రిలో ఒక హత్య జరిగింది. అంతకుముందు పుట్లూరు మండలపరిధిలో బాలికపై అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. వీటిల్లో ఇప్పటివరకూ పోలీసులు కనీస పురోగతి సాధించలేదు.

మళ్లీ 'ప్రైవేటు'కే!

- ఏజెన్సీ చేతుల్లోకి వాహన ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఆర్టీఏ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో వాహన ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ మళ్లీ ప్రైవేటు ఏజెన్సీ చేతుల్లోకి వెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను గతంలోనే ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. జిల్లాలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ వారు రాప్తాడు సమీపంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. కొన్ని నెలల పాటు కార్యకలాపాలు కొనసాగాయి. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఏజెన్సీల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలుస్తోంది. సోమవారం నుంచి అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో కాకుండా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలోని శివశంకర్ ఎంటర్ ప్రైజెస్‌లోనే ఫిట్‌నెస్ పరీక్షలు జరగనున్నాయి.

వాహనదారులకు ఇబ్బందులు..

ఫిట్‌నెస్ పరీక్షలపై కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యలు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సోమవారం నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు జరగవని ఆర్టీఏ అధికారులు శనివారం ఉన్నట్లుండి ప్రకటించారు. అయితే చాలా మంది అప్పటికే స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వారి పరిస్థితి ఏమిటని ఉప రవాణా కమిషనర్ వీర్రాజును వివరణ కోరగా.. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వాహనదారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే రూ. వేలల్లో నష్టపోవాల్సి వస్తుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాపం 'నారాయణ'దే



మంత్రి నారాయణ దిష్టిబొమ్మను దహనం చేయకుండా నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- వెంటనే మంత్రి వర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలి
- బాధిత కుటుంబానికి రూ. కోటి చెల్లించాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి చరణ్ ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవి నుంచి నారాయణను బర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నారాయణ కళాశాలల యజమాని, మంత్రి నారాయణ దిష్టిబొమ్మను శనివారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద చెప్పులతో కొడుతూ దగ్ధం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలపై నారాయణ విద్యాసంస్థల యాజమాన్యానికి లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నారాయణ విద్యాసంస్థలకు తొత్తుగా పని చేస్తున్న ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను సస్పెండ్ చేయాలన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో ఇప్పటివరకూ వందల సంఖ్యలో విద్యార్థులు చనిపోయినా ఎక్కడా కేసులు నమోదు చేయలేదన్నారు. విద్యార్థి ఆత్మహత్యపై అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. అవసరమైతే త్వరలో నారాయణ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, నగర అధ్యక్షుడు కైలాష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఏఐఎస్బీ జిల్లా కార్యదర్శి పృథ్వి, బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, జనసేన విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సిద్దు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు మంజునాథ్, సాయి హర్ష, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సోము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల' ఎన్నికల్లోనూ 'పచ్చ' పైత్యం

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాల (షీప్ సొసైటీ) ఎన్నికల్లోనూ అధికార పార్టీ నేతలు తలదూర్చారు. 'పచ్చ' పార్టీ నేతలు చెప్పినట్లే పశు సంవర్ధక శాఖ అధికారులు, ఎన్నికల అధికారులు చేస్తుండటంతో 'తమ్ముళ్లు' రెచ్చిపోతున్నారు. గ్రామాల్లో గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న జీవాల కాపర్ల సంక్షేమం కోసం రాజకీయాలతో సంబంధం లేకుండా 'షీప్ సొసైటీ'లు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 121 సొసైటీల ఎన్నికలకు అధికారులు ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారు. మొదటి విడతగా ఈనెల 7న 36 సొసైటీలు, 18న 36, శనివారం 35 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించారు. వివిధ కారణాలు చూపి మొదటి, రెండు విడతల్లో 13 సొసైటీల ఎన్నికలను టీడీపీ నేతలు నిలిపివేయించారు. శనివారం కూడా నాలుగైదు సొసైటీల ఎన్నికలు ఆపేసినట్లు తెలిసింది. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు అధికంగా ఉండటంతో సొసైటీలు ఆ పార్టీకి హస్తగతం కాకుండా అడ్డుకున్నట్లు సమాచారం.



గ్రామంలో షీప్ సొసైటీ ఎన్నిక నిర్వహించాలంటూ ఆందోళన చేస్తున్న మదిగుబ్బవాసులు

మదిగుబ్బలో రెచ్చిపోయిన 'పచ్చ'మూక..

ఆత్మకూరు మండలం మదిగుబ్బలో శనివారం షీప్ సొసైటీ ఎన్నికల సందర్భంగా 'పచ్చ'మూక రెచ్చిపోయింది. ఎన్నిక సందర్భంగా గ్రామంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు,స్పెషల్‌పార్టీ పోలీసులను రంగంలోకి దింపారు. అయినా, టీడీపీ నాయకులు జులుం ప్రదర్శించారు. మదిగుబ్బ సొసైటీ పరిధిలో 140 మంది వరకు ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన మలరాయుడుకు 94 మంది మద్దతు ఇచ్చారు. అయితే, మలరాయుడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో స్థానిక టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక రచ్చ రాజేశారు. ఇతర గ్రామాల నుంచి 'తమ్ముళ్ల'ను పిలిపించుకుని దౌర్జన్యం చేశారు. "నువ్వేం చేస్తావో తెలీదు.. మేం చెప్పిన వారినే అధ్యక్షుడు కావాలి" అంటూ ఎన్నిక అధికారి దగ్గరకు వెళ్లి బెదిరింపులకు దిగారు. అయితే వైఎస్సార్ సీపీ నాయకులు వెనకడుగు వేయకపోవడంతో చేసేది లేక బలవంతంగా ఎన్నిక రద్దు చేయించారు. ఈ క్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు.. జేసీ శివ్‌నారాయణ్‌శర్మ, పశుశాఖ జేడీ వెంకటస్వామి, ఎన్నికల విభాగం అధికారి శ్రీలక్ష్మిని కలిశారు. నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఓటుతోనే ప్రజాప్రభుత్వ నిర్మాణం

- ఓటరు దినోత్సవంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: "ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఓటు ద్వారానే ప్రజాప్రభుత్వం నిర్మితమవుతుంది. ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి. రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి" అని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. జేసీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదును ప్రోత్సహించడంతో పాటు ఓటరుగా నమోదైన యువతను సత్కరించి ఓటరు గుర్తింపు కార్డు అందిస్తున్నామన్నారు. అనంతరం అధికారులు, ఓటర్లు, ప్రజలతో భారత ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. 80 ఏళ్లపైబడిన ఓటర్లు శివలింగమ్మ, నల్లమ్మను సన్మానించారు. నూతన ఓటరుగా నమోదైన సాయికుమార్, చరణ్, జ్యోత్స్న, ఈశ్వర్‌సాయి, సాయికృష్ణ, స్రవంతిలకు ఓటరు గుర్తింపు కార్డు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కళాశాల విద్యార్థులు అమృత, దీపిక, మల్లీశ్వరి, లక్ష్మినవ్య, మల్లిక, రిఫాత్‌కు, పాఠశాల విద్యార్థులు హర్షవర్ధన్, మేఘన, పూర్ణపుష్కల, కళ్యాణచక్రవర్తి, హర్షవర్ధన్, దుర్గకు బహుమతులు అందజేశారు. ఎన్నికల ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలో ప్రతిభ కనబరిచిన డిప్యూటీ తహసీల్దార్లు సుజాతదేవి, నాగేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు ఎస్.వి. ప్రసాద్, శ్రీనివాసులు, ఐటీ సపోర్ట్ ఇంజినీర్ శివ, ఎన్నికల డీఈఓ శ్రీనాథ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మెమెంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఈఆర్ఓలు శిరీష, మల్లికార్జున, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరి, డీఐపీఆర్ఓ గురస్వామిశెట్టి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎన్నికల రీజినల్ కో-ఆర్డినేటర్ నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



80 ఏళ్ల వయసు పైబడిన ఓటరును సన్మానిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

సౌతిండియా సైన్స్‌ఫేర్‌లో సత్తా

అనంతపురం ఎడ్యుకేషన్/ కణేకల్లు: దక్షిణ భారత దేశ స్థాయి సైన్స్‌ఫేర్ (విద్యా వైజ్ఞానిక ప్రదర్శన)లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రాజెక్ట్‌లకు బహుమతులు దక్కాయి. పుదుచ్చేరిలో ఈ నెల 21న ప్రారంభమైన సైన్స్‌ఫేర్ శనివారం ముగిసింది. టీచర్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతికి ఎంపికైంది. ఉరవకొండ మండలం ఆమిద్యాల జెడ్పీ హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు 'కాంతి ధర్మాలను సులువుగా వివరించేందుకు ఉపాధ్యాయులకు ఉపకరించే పరికరాలు' అనే అంశంపై ప్రదర్శించిన ప్రాజెక్ట్ విజేతగా నిలిచింది. 'నిత్య జీవితంలో కాంతి ధర్మాలు ఏ విధంగా ఉపయోగపడతాయో టీచరు తన ప్రాజెక్ట్ ద్వారా వివరించారు.

'ఊతకర్ర ప్రాజెక్ట్'కు ప్రత్యేక బహుమతి..

జిల్లా నుంచి గ్రూపు కేటగిరీ విభాగంలో కణేకల్లు మండలం హనకనహాళ్ జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు పి.గీతారెడ్డి, డి.మహాలక్ష్మి ప్రదర్శించిన 'వృద్ధులకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఊతకర్ర' ప్రాజెక్ట్ ప్రత్యేక కేటగిరీ బహుమతికి ఎంపికైంది. వృద్ధులకు అనువైన బహుళ ఉపయోగాలు కలిగిన ఊత కర్ర వృద్ధులు, రోగులకు నిత్య జీవితంలో అవసరమైన అనేక సౌకర్యాలను కల్పిస్తుంది. సాధారణంగా నడిచేందుకు ఊతమివ్వటమే గాకుండా వివిధ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకతలు కలిగి ఉన్న 'ఊతకర్ర' గురించి విద్యార్థినులు ప్రదర్శనలో వివరించారు. పుదుచ్చేరి స్పీకర్, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. దక్షిణభారత స్థాయి ప్రదర్శనలో సత్తా చాటిన టీచరు, విద్యార్థులను డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, హెచ్‌ఎం వేణుగోపాల్ అభినందించారు.



బహుమతి అందుకుంటున్న టీచరు బండి శ్రీనివాస్



హనకనహాళ్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రదర్శిస్తున్న ప్రాజెక్ట్

గణతంత్రం.. త్రివర్ణ శోభితం

గణతంత్ర దినోత్సవానికి అనంతపురం పోలీసు పరేడ్ మైదానం ముస్తాబైంది. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకలను తిలకించేందుకు హాజరయ్యే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించారు. ఆదివారం ఉదయం 8.55 గంటలకు జాతీయ పతాకాన్ని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.20 గంటలకు కలెక్టర్ సందేశాన్ని వినిపిస్తారు. 10 గంటలకు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, అటు తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విశిష్ట సేవలు అందించిన దాదాపు 300 మందికి ప్రశంసా పత్రాలు అందిస్తారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. – అనంతపురం అర్బన్



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం

క్లుప్తంగా

మూడిళ్లలో చోరీ



క్లూస్‌టీంతో పరిశీలిస్తున్న సీఐ సత్యబాబు, పోలీసు సిబ్బంది

యల్లనూరు: మండల కేంద్రం యల్లనూరులో దొంగలు చెలరేగిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి వేళ ఎస్సీ కాలనీకి చెందిన పుల్లమ్మ, ప్రహల్లాద్, ఎన్‌కే కాల్వ రోడ్డులో నివాసం ఉంటున్న కొత్త మిద్దె మనోహర్ ఇంట్లో చోరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పుట్లూరు సీఐ సత్యబాబు శనివారం మీడియాకు వెల్లడించారు. పుల్లమ్మ ఒంటరిగా ఉండటంతో ఇంటికి తాళం వేసి సమీపంలోని చెల్లి ఇంట్లో రాత్రి పూట నిద్రించేది. ప్రహ్లాద పులివెందులలో ఓ ఇంట్లో కాపలాదారుగా పనిచేస్తున్నాడు. ఎన్‌కే కాల్వ రోడ్డులో ఉండే మనోహర్ కూలి పని నిమిత్తం వెళ్లాడు. మూడు గృహాలకు తాళాలు వేసి ఉండడం గమనించిన దుండగులు అర్ధరాత్రి వేళ చొరబడ్డారు. బీరువాలోని బంగారు వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకట నరసింహులు, ఏఎస్‌ఐ నారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నారాయణ, క్లూస్ టీం శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి టౌన్: భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పట్టణంలోని అడపాల వీధికి చెందిన భారత కవిజ్యోతి శనివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కవిజ్యోతికి 2019లో కడపలో అల్మాస్ పేట నివాసి అయిన పానేటి ఆంజనేయులు కుమారుడు శ్రీనివాసులుతో పెళ్లి జరిగింది. కట్నం కింద 9 తులాల బంగారు, రూ.3 లక్షల నగదు, బుల్లెట్ బైక్ ఇచ్చారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. ఆ తర్వాత కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు వేధిస్తుండడంతో ఆమె నెల కిందట కదిరికి వచ్చేసింది. అయినా ఫోన్ చేసి మరీ వేధిస్తుండడంతో భరించలేకపోయిన కవిజ్యోతి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వివాహిత బలవన్మరణం

హిందూపురం అర్బన్: మరవపల్లిలో శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రమ్య (21) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. నింకంపల్లికి చెందిన రమ్యకు మూడేళ్ల క్రితం పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరు కొంత కాలంగా మరవపల్లిలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరు ప్రతి చిన్నవిషయానికీ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రమ్య శుక్రవారం రాత్రి ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

లీజు ధరలో తిరకాసు

- విండ్ పవర్ కంపెనీల ఇష్టారాజ్యం
- ఒక్కో పంచాయతీలో ఒక్కో రకంగా ధర
- పంచాయతీల తీర్మానం లేకనే భూ సేకరణ
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నిబంధనల ఉల్లంఘన



కళ్యాణదుర్గం: పవన విద్యుత్తు తయారీ కోసం గాలి మరలు ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. అవసరమైన భూముల సేకరణ.. లీజు ధరల ఖరారులో తకరారు చేస్తున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరతో భూములు లీజుకు తీసుకుని లబ్ధి పొందేందుకు ఎత్తుగడ వేస్తున్నాయి. గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండానే తమ పని కానిస్తుండడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రెవెన్యూ, ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్ అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులూ వెలువడక ముందే సొంతంగా ఆయా కంపెనీలు భూసేకరణ చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అనుమతులు లేకనే భూ సేకరణ..

కంబదూరు మండలం అచ్చంపల్లి, రాళ్లపల్లి, మేళ్లకుంట, రాంపురం, కర్తనపర్తి, చెన్నంపల్లి, నూతిమడుగు, గూళ్యం, రాళ్ళ అనంతపురం, పాళ్లూరు, గొల్లపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో వివిధ కంపెనీ ప్రతినిధులు దాదాపు 60 గాలి మరల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. నెడ్‌క్యాప్ నుంచి అనుమతులు లేకనే భూముల లీజుకు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే సొంతంగా ఎకోరియన్ కంపెనీ అంటూ ఓ వ్యక్తి భూ సేకరణకు శ్రీకారం చుట్టారు. గాలిమరల ఏర్పాటుపై సర్పంచ్, రెవెన్యూ, ఆర్డీఓ, కలెక్టర్, నెడ్‌క్యాప్ ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఏ ఒక్క పంచాయతీలోనూ ఇలాంటి గ్రామ సభ జరగలేదు. దీనికి తోడు ఏకంగా 30 ఏళ్ల పంచాయతీ నుంచి లీజు ఒప్పందం కుదుర్చుకునేలా కంపెనీ ప్రతినిధులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పంచాయతీలో ఒక్కో విధంగా భూములకు లీజు ధర నిర్ణయిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. గ్రామాల్లో వాస్తవ భూ ధరలకు విరుద్ధంగా ఒక చోట రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఎకరం లీజు తీసుకుంటే.. మరోచోట రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ధరలు నిర్ణయిస్తున్నారు. ధరల్లో తేడాపై పలు గ్రామాల సర్పంచులు కంపెనీ ప్రతినిధులపై మండిపడుతున్నారు.

ఎన్‌ఓసీల కోసం ఒత్తిళ్లు..

కంబదూరు మండలంలోని పలు గ్రామాల సర్పంచులు కంపెనీ ప్రతినిధుల నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భూ సేకరణ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడుతున్నారు. ధరల వ్యత్యాసంపై సర్పంచులు కంపెనీ ప్రతినిధులను నిలదీస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాధానమూ రావడం లేదు. మరికొందరు సర్పంచులపై గాలి మరల ఏర్పాటుకు స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతో ఒత్తిళ్లు తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కంపెనీ ప్రతినిధుల మోసాలపై



త్వరలోనే సర్పంచులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రెండు గ్రామాల్లో మాత్రమే భూ సేకరణ చేస్తున్నాం

కంబదూరు మండలం నూతిమడుగు, రాళ్ల అనంతపురం గ్రామ పంచాయతీల్లో భూసేకరణ చేస్తున్నాం. కంపెనీ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తూ గ్రామ సర్పంచుల తీర్మానాలు తీసుకుంటున్నాం. పంచాయతీ నుంచి అనుమతులు వచ్చాకే భూ సేకరణ చేస్తున్నాం.

– నవీన్, విండ్ పవర్ ప్రతినిధి

దానిమ్మ చెట్లు బుగ్గిపాలు

- ప్రమాదమా...పని కట్టుకుని చేశారా?



కాలిపోయిన దానిమ్మ చెట్లు

రాప్తాడు రూరల్: చేతికొచ్చిన దానిమ్మ చెట్లు బుగ్గిపాలయ్యాయి. ప్రమాదవశాత్తూ జరిగిందా? లేదంటే ఎవరైనా పని కట్టుకుని కావాలనే అగ్గిపెట్టారా? అనేది అంతు చిక్కడం లేదు. చెట్లను పూతకు వదిలిచేందుకు సిద్ధం చేస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికి చెందిన రైతు సుధాకర్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో ఏడేళ్ల కిందట 1600 చీనీ మొక్కలు నాటాడు. గతేడాది తొలిసారి పంట తీసుకున్నారు. ఈసారి రెండోపంటకు సిద్ధం చేస్తున్నాడు. చెట్ల మధ్య గడ్డి ఏపుగా పెరగడంతో నెల కిందట మందు కొట్టాడు. ఆ గడ్డంతా బాగా ఎండిపోయింది. గడ్డిని తొలగించి పాదులు చేసి చెట్లను పంటకు వదిలేందుకు రెడీ చేసుకుంటున్నాడు. శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో రైతు సుధాకర్ రెడ్డి దంపతులు తోటలోకి వెళ్లారు. దానిమ్మ చెట్లను పరిశీలించి... మరొవైపు ఉన్న చీనీ చెట్లలోకి వెళ్లారు. కాసేపటికి సుధాకర్‌రెడ్డి మందుల కోసమని అనంతపురం బయలుదేరి వెళ్లాడు. 8.30 గంటల సమయంలో దానిమ్మ చెట్ల మధ్యలో ఉన్న గడ్డికి మంట వ్యాపించింది. అంతే దావానంలా అన్ని చెట్లకూ పాకి కాలిపోయాయి. చీనీచెట్లలో ఉన్న సుధాకర్‌రెడ్డి భార్య గుర్తించి పరుగుపరుగున అక్కడికి వచ్చినా ఏమీ చేయలేని పరిస్థితి. వెంటనే భర్తకు సమాచారం అందించింది. ఆయన వచ్చేసరికి పంట మొత్తం కాలిపోయింది. సచివాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ, సచివాలయ ఉద్యోగులు, పోలీసులు వచ్చి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. రైతు మాట్లాడుతూ తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని చెబుతున్నాడు. ప్రమాదం ఎలా జరిగిందో తెలీదుకాని ఏడేళ్ల వయసున్న చెట్లన్నీ కాలిపోయాయని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి
- సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శుల డిమాండ్



విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ నేతలు

బత్తలపల్లి: అనంతపురం శివారులోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి చరణ్ కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బత్తలపల్లిలో చరణ్ కుటుంబ సభ్యులను సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఏఐటీయూసీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడు తదితరులు పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ వేధింపుల కారణంగా విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడని, బాధిత కుటుంబానికి ప్రభుత్వంతో పాటు విద్యాసంస్థల అధినేత తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. కళాశాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వీరి వెంట ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుళ్లాయిస్వామి, సత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు వంశీ, మంజునాథ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, గౌతంమూర్తి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్, రామకృష్ణయ్య, ఎన్వీ రమణ తదితరులు ఉన్నారు.

వీడిన హత్య మిస్టరీ

- అల్లుడే నిందితుడు
- మామతో మనస్పర్థలే కారణం



నిందితుడిని మీడియాకు చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: ఓబుళాపురం సమీపాన జరిగిన వ్యక్తి హత్య మిస్టరీని పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. మామతో ఉన్న మనస్పర్థల నేపథ్యంలో అల్లుడే కడతేర్చినట్లు తేల్చారు. చాకచక్యంగా నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాయదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలిసి డీఎస్పీ రవిబాబు మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రలోని మిరాజ్ పట్టణానికి చెందిన బోస్లే సంచార జీవనంలో భాగంగా నెల కిందట భార్య, పిల్లలతో కలిసి డీ హీరేహాళ్ మండలం ఓబుళాపురం చేరుకున్నాడు. శివారులో గుడారం వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాస్టిక్ గృహోపకరణాలు విక్రయిస్తూ రాత్రి వేళకంతా గుడారం వద్దకు చేరేవాడు. పెద్ద కుమార్తె భారతికి బళ్లారి జిల్లా సంగనకల్‌కు చెందిన శ్రీనాయక్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశాడు. వీరుకూడా ఓబుళాపురంలోనే ఉంటూ సంచార జీవనం సాగిస్తున్నారు. వివాహ సమయంలో కట్నకానుకలు ఏమీ ఇవ్వలేదు. అవసరాల నిమిత్తం ఇటీవల రూ.80 వేలు అల్లుడితోనే బోస్లే అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బు రికవరీ విషయంలో మామ, అల్లుడి మధ్య వివాదం మొదలైంది. డబ్బు ఇవ్వకపోగా.. తన కూతురిని మరొకరికి ఇచ్చి పెళ్లి చేస్తానని, నీవు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అల్లుడిపై విరుచుకుపడ్డాడు. తన సంసారాన్ని నాశనం చేసేలా ఉన్నాడని భావించిన అల్లుడు.. మామను మట్టుబెట్టాలని పథకం రచించాడు. అదును కోసం ఎదురుచూస్తూ వచ్చాడు. అందులో భాగంగా ఈ నెల 21న అర్ధరాత్రి మారణాయుధాలతో బోస్లేని నరికి చంపాడు. మృతదేహాన్ని దూరంగా పడేసి పరారయ్యాడు. హత్య ఘటనపై వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంటకరమణ రంగంలోకి దిగారు. అల్లుడిపై అనుమానం రావడంతో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అతడిని శనివారం ఓబుళాపురం చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో మామను చంపింది తనేనని శ్రీనాయక్ ఒప్పుకున్నాడు. నాలుగు రోజుల వ్యవధిలోనే హత్య మిస్టరీని ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

కుక్కల దాడిలో జింకకు తీవ్ర గాయాలు



జింకను అటవీశాఖ సిబ్బందికి అప్పగిస్తున్న నవీన్‌కుమార్

రొళ్ల: కుక్కల దాడిలో జింక తీవ్రంగా గాయపడింది. శనివారం అటవీ ప్రాంతం నుంచి ఆహారం కోసం జింక హెచ్‌ఎం పల్లి పొలిమేర వద్దకు వచ్చింది. కుక్కలు గమనించి జింకను తరిమే క్రమంలో తీవ్రంగా గాయపరిచాయి. అటుగా పొలం వైపు వెళ్తున్న నవీన్‌కుమార్ అనే యువకుడు జింకను రక్షించి ద్విచక్రవాహనంపై రొళ్ల పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. తర్వాత సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జింకను మెరుగైన వైద్యం కోసం మడకశిర పశువైద్యశాలకు తరలించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బందికి జింకను అప్పగించారు.

విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం



విజేత సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ పార్థసారథి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురంలోని రామ్‌నగర్ 80 ఫీట్ రోడ్డులో విజేత సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు విక్రయించాలన్నారు. ప్రధాన నగరాల్లో ఉండే మార్కెట్ అనంతపురంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజేత సూపర్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ చౌదరి మాట్లాడుతూ 1999లో సూపర్ మార్కెట్ రంగంలో మొదటి బ్రాంచ్ స్థాపించి, విజేత సూపర్ మార్కెట్ ఒక బ్రాండుగా నిలిచిందన్నారు. 25 ఏళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారుడు నిసార్ ఆత్మహత్య



నిసార్ అహ్మద్ (ఫైల్)

అనంతపురం సెంట్రల్: నగరంలోని ఓ లాడ్జిలో ప్రజా ఉద్యమకారుడు నిసార్ అహ్మద్ (51) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, పలువురు దళిత సంఘనాయకులు తెలిపిన మేరకు... మహాత్మాగాంధీ కాలనీలో నివాసముంటున్న నిసార్ అహ్మద్ దళితసంఘం నాయకుడిగా, ప్రజా ఉద్యమకారుడిగా నగర ప్రజలకు సుపరిచితులు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఆయన సతమతమవుతున్నాడు. శుక్రవారం ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. శనివారం రూమ్ బాయ్ తలుపు కొట్టగా ఎంత సేపటికీ తీయకపోవడంతో అనుమానం వచ్చి వెంటిలేటర్‌లోంచి చూడగా నిసార్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా.. వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. మూడు దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై ఉద్యమించిన నిసార్ ఆత్మహత్య చేసుకోవడంపై ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో మూడు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏడుగురు క్రయవిక్రయదారులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం రాప్తాడులోని అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి, అనంతపురం, తాడిపత్రికి చెందిన పూల సునీల్ కుమార్, మండ్ల కుళ్లాయప్ప, పోకల విజయ్ కుమార్ శనివారం గంజాయిని విక్రయించేందుకు ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపానికి చేరుకున్నారు. వీరి వద్ద అనంతపురం, రూరల్ మండలం కాటిగానికాలువ, కదిరికి చెందిన యర్రగుంట చంద్రకాంతరెడ్డి, బండారు శివప్రసాద్, బెస్త భానుప్రకాష్, గొల్ల క్రాంతికుమార్ కొంటుండగా రాప్తాడు సీఐ టీవీ. శ్రీహర్ష తన సిబ్బందితో వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురినీ రిమాండ్‌కు తరలించారు. సీఐ, సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ అభినందించారు.

50 గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలను పరిశీలిస్తున్న వెటర్నరీ ఏడీ, ఫారెస్ట్ సిబ్బంది

శింగనమల: గుర్తు తెలియని జంతువుల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శింగనమలలోని కొండ సమీపాన కాపరి కాయల చలపతి తన గొర్రెల మంద కోసం దొడ్డి వేసుకొన్నారు. శుక్రవారం గొర్రెలను మేపునకు తోలుకొని వెళుతూ పిల్లలను దొడ్డి వద్దే ఉంచాడు. సాయంత్రం వచ్చి చూడగా గుర్తు తెలియని జంతువుల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. దీనితో శనివారం శింగనమల పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభం, ఫారెస్ట్ సిబ్బంది తేజేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ పరిశీలించారు. గొర్రెల దొడ్డిని, చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. గొర్రెల కాపర్లతో ఆరా తీశారు. గుర్తు తెలియని జంతువులు దాడి చేసినట్లు వివరించారు. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కాపర్లు తెలిపారు. కొండ ప్రాంతంలో చిరుతపులులు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం నిర్వహించి, మృతికి గల కారణాలను నిర్ధారిస్తామని వెటర్నరీ వైద్యులు, ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

ఆంత్రాక్స్‌తో 15 గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెలు

కంబదూరు: రాళ్ల అనంతపురంలో ఆంత్రాక్స్ వ్యాధితో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత గొర్రెల కాపరులు మల్లప్ప, ఈరన్న తెలిపారు. మృతి చెందిన గొర్రెలను పశుసంవర్ధక శాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెల మృతితో రోడ్డునపడ్డ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, గ్రామస్తులు కోరారు.

వితంతువుపై విచక్షణారహితంగా దాడి



చికిత్స పొందుతున్న అనూరాధ

గార్లదిన్నె : మర్తాడులో ఓ వితంతువుపై అదే వీధికి చెందిన తల్లీకుమారుడు విచక్షణారహితంగా దాడిచేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అనూరాధ వితంతువు. రెండు రోజుల క్రితం సాయి అనే వ్యక్తి ఆటోలో వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. స్వల్పంగా గాయపడ్డాడు. శనివారం సాయిని తల్లి సావిత్రి ప్రమాదంపై ఆరా తీసింది. ఆ రోజు ఎవరి ముఖం చూశావు, ఇలా జరిగిందని అడిగితే.. అనూరాధ ఆటోకు ఎదురుగా వచ్చిందని సాయి చెప్పాడు. అంతే ఆమె ఆగ్రహంతో ఊగిపోతూ కుమారుడితో కలిసి వెళ్లి అనూరాధ ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా దాడి చేశారు. అకారణంగా తనపై దాడి చేశారని బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం అనూరాధ అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోందని ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

మద్యం దుకాణానికి జరిమానా

లేపాక్షి: మండల కేంద్రంలోని మద్యం దుకాణంపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండటం గుర్తించి రూ.5 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందనాయక్ తెలిపారు.

గణతంత్ర కీర్తి.. అనంత స్ఫూర్తి

- స్వాతంత్ర్యోద్యమం, రాజ్యాంగ నిర్మాణంలో చురుకైన పాత్ర
- అనంతపురంలో ఎన్నో వీధులకు దేశభక్తుల పేర్లు
- గణతంత్ర వేడుకల వేళ స్మరించుకుంటున్న ప్రజలు



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



అనంతపురం కల్చరల్/రాప్తాడు: భరతమాత బానిస సంకెళ్లు తెంచుకుని 77 ఏళ్లు గడిచిపోయాయి. దాస్యపు ఆలోచలనతో నిండిన రాజ్యాంగాన్ని కాదని ప్రత్యేక రాజ్యాంగం కోసం ఎంతోమంది మహనీయులు మేధాశక్తిని ధారపోశారు. అందులో 'అనంత' వాసులూ స్ఫూర్తిదాయకమైన పాత్ర పోషించారు. కల్లూరు సుబ్బారావు, నీలం సంజీవరెడ్డి భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలకంగా ఉన్నవారే. రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26వ తేదీని ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవంగా నిర్వహిస్తూ వస్తున్నాం. ఆ అపురూప ఘట్టాలను స్మరించుకుంటూ ఊరంతా దేశభక్తితో ఉరకలేస్తోంది. స్వాతంత్ర్య సంగ్రామపు రోజులను తలపిస్తూ జాతీయ జెండాలు వాడవాడలా రెపరెపలాడుతూ దేశభక్తిని చాటుతున్నాయి. తొమ్మిది పదుల వయసు దాటిన వృద్ధులు అలనాటి ముచ్చట్లను 'సాక్షి'తో పంచుకున్నారు.

వీధులకు త్యాగధనుల పేర్లు

స్వాతంత్ర్య పోరులో స్ఫూర్తిదాయకంగా జిల్లాను ముందుకు నడిపిన ఎందరో మహనీయులను స్మరించుకుంటూ తొలితరం పాలకులు జిల్లా కేంద్రం అనంతపురంలోని చాలా వీధులకు నాటి త్యాగధనుల పేర్లు పెట్టారు. ఈనాటికీ అప్పటి నామఫలకాలు కనపడతాయి. పటేల్‌రోడ్డు, గాంధీ బజార్, తిలక్‌రోడ్డు, నేతాజీ రోడ్డు ఇవన్నీ పాతూరులోని వీధుల పేర్లు. రాజాజీ వీధి, పైడి లక్ష్మయ్య రోడ్డు అంటే గుర్తుపట్టలేం కానీ కోర్టు రోడ్డు అంటే తెలుస్తుంది. అంతెందుకు ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న రాజు రోడ్డుకు తొలిపేరు అల్లూరి సీతారామరాజు రోడ్డు. అక్కడ నివసించే వారిలోనే చాలామందికి ఈ విషయం తెలియదు. ఆనాటి ప్రాతఃస్మరణీయుల పేర్లను పదిల పరచుకోవాలని ఆ తరం వారు అభిప్రాయపడుతున్నారు.

పరుల కోసం బతకడంలోనే ఆనందం



నా వయసు 95 ఏళ్లు. ఇతరుల కోసం బతకడం అప్పటి నేతలు నేర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడటమంటే వీధుల్లోకి రావడమే కాదు సాటి మనిషి బాగుపడడానికి దోహదపడాలన్నది అప్పటి వారి ఆలోచన. మా రోజుల్లో ఎన్నేళ్లొచ్చినా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరంగానే ఉండేవాళ్లం. మా అమ్మ తిప్పమ్మ 115 ఏళ్లు, నాన్న లింగప్ప 100 ఏళ్లకు పైగా జీవించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని, రిపబ్లిక్ దినోత్సవాన్ని కన్నులారా చూసే అవకాశం వచ్చింది. దేశనాయకులందరినీ చూశాను. వారి జీవితాల గురించి అందరూ తెలుసుకోవాలి.

– గొరవ పెద్దన్న, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

గాంధీజీని చూడటానికి వెళ్లా..



నేను నూరేళ్లకు మరో రెండు వసంతాల దూరంలో ఉన్నాను. గాంధీజీ ఓసారి అనంతపురానికొచ్చినప్పుడు, నెహ్రూ బెంగళూరుకు వచ్చినపుడు దూరాభారమైనా వారిని చూడాలన్న తపనతో వెళ్లొచ్చాను. మేము ప్రత్యక్షంగా స్వాతంత్ర్యపోరులో లేము కానీ అప్పట్లో అందరి ధ్యాస భరతమాతను బానిసత్వం నుండి కాపాడాలన్నదే. స్వాతంత్ర్యం వచ్చిన రెండేళ్లకే అమ్మ , తర్వాత నాన్న చనిపోయారు. అలా ఆ రోజులన్ని గుర్తుండిపోయాయి. అప్పటితరం నాయకుల త్యాగాలను, వారి పేర్ల ఉన్న స్థలాల ప్రాధాన్యతను ఇప్పటి వారికి చెప్పే ప్రయత్నం చేయాలి.

– గుగ్గిళ్ల ఈశ్వరరెడ్డి, బోగినేపల్లి, రాప్తాడు మండలం

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను కలిసిన క్రిస్టియన్ మైనార్టీ విభాగం నగరాధ్యక్షుడు విజయ సతీష్



జిల్లా అధ్యక్షుడు అనంతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ అధిష్టానం అనంతపురం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించిన విషయం విధితమే. శనివారం జిల్లా అధ్యక్షుడు అనంతను ఆయా విభాగాల అధ్యక్షులు కలసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు అనంత పిలుపునిచ్చారు. అనంతను కలిసిన వారిలో క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు విజయసతీష్, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులు డాక్టర్ సీ జయప్రకాష్ రెడ్డి, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు తాటిచెర్ల గోస్‌పీరా, మహిళా విభాగం అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, మునిసిపల్ విభాగం అధ్యక్షురాలు ఎం దేవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, శ్రీదేవి, అమర్‌నాథ్ రెడ్డి, సైపుల్లాబేగ్, పార్టీ నాయకులు సాకే కుళ్లాయి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత నగరోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలో కొత్తూరి అమ్మవారి గ్రామోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చానరసింహులు ఆధ్వర్యంలో వాసవీ దీక్షాసమితి వారు స్థానిక టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్, ఐరన్‌బ్రిడ్జి మీదుగా పాతూరు వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం వరకూ భక్తిగీతాలు ఆలపిస్తూ అమ్మవారి నామ స్మరణతో మార్మోగించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు అమ్మవారికి దీపాలు, కలశాలను మోశారు. అనంతరం అమ్మవారి శాలలో వాసవీమాత మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. తీర్థ ప్రసాద వితరణ, నారాయణ సేవ కార్యక్రమాలను వాసవీమాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఒలింపియాడ్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానిక సంగమేష్ నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. యూనిఫైడ్ కౌన్సిల్ వారు జనరల్ నాలెడ్జ్ ఒలిపియాడ్ పరీక్షలను దేశవ్యాప్తంగా 50 వేల మంది విద్యార్థులకు నిర్వహించారు. మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు ఎ.సన్నిధి (4వ తరగతి) జాతీయ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకం ల్యాప్‌టాప్ గెలుపొందినట్లు కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు ఎం.పృథ్వీరాజ్, జి.జ్ఞానేశ్వరి వరుసగా 7వ ర్యాంకు, 13వ ర్యాంకు, 8వ తరగతి విద్యార్థిని 5వ ర్యాంకు సాధించి బంగారు పతకాలు, నగదు బహుమతులు, ప్రశంశపత్రాలు దక్కించుకున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

సందడిగా సాంస్కృతిక సంబరాలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి



ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా శనివారం లహరి డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ సంస్థ రజతోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి విచ్చేసిన డ్యాన్స్ మాస్టర్ల తమ బృందాలతో సందడి చేశారు. అనంతతో పాటూ తిరుపతి, నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి విచ్చేసిన 25 మంది సీనియర్ శాస్త్రీయ నాట్యాచార్యులు, 25 మంది వెస్ట్రన్ డ్యాన్సర్లను సన్మానించారు. తొలిరోజు వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డితో పాటూ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ స్వర్ణ, సీనియర్ శాస్త్రీయ నాట్యకోవిదులు సంధ్యామూర్తి, తొలితరం డ్యాన్స్ మాస్టర్ పామిడి షణ్ముఖనాయుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. చిన్నారుల సృజనను ప్రోత్సహిస్తున్న హరిప్రసాద్ కృషిని అభినందించారు. ఆదివారం జరిగే ముగింపు వేడుకలకు హీరో సంపూర్ణేష్‌బాబు ఆత్మీయ అతిథిగా విచ్చేస్తారని నిర్వాహకుడు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు కృష్ణమూర్తిరాజు, పట్నం శివప్రసాద్, బాషా, సత్యనారాయణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పట్టించుకోరా?

అనంతపురం అర్బన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాల నుంచి స్పందన లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు విస్మరించారని దుయ్యబట్టారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు అవుతున్నా రజక కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయలేదన్నారు. రజకుల దోభీ ఘాట్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజక కార్పొరేషన్ ద్వారా అర్హత ఉన్న ప్రతి రజక కుటుంబానికి సొంత పూచీకత్తుపై రూ.10 లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు నాగప్ప, ఆదినారాయణ, ఈశ్వరమ్మ, నాగరాజు, భూషణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలుడు శనివారం అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిట్టిబాబుపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం సెంట్రల్: రజకులను కులం పేరుతో దూషించిన సినీ డైరెక్టర్ త్రిపురనేని చిట్టిబాబుపై కేసు నమోదు చేయాలని రజక సంఘాల పోరాట సమితి కో–కన్వీనర్ హనుమన్న, రజక ఫెడరేషన్ మాజీ చైర్మన్ నాగేశ్వర రావు,నాయకులు శివానంద డిమాండ్ చేశారు. శనివారం రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 5న ఓ టీవీ చానల్ లైవ్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడిన తీరు రజకులను అవమాన పర్చేలా ఉందని పేర్కొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ఓటే వజ్రాయుధం. ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓటు ప్రాముఖ్యత, జాతీయ ఓటరు దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యం దేశంలో ఓటు హక్కు వజ్రాయుధంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: దేశ భవిష్యత్తు ఓటుతో ముడిపడి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తహసీల్దార్ విజయకుమారి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అధికారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు అనేది చాలా విలువైనదన్నారు. దేశాభివృద్ధిని మార్చేది ఓటే అన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, డీటీ చెన్నకేశవులు, సిబ్బంది రామాంజినేయులు, ప్రసాద్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని సనప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం సుధ అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రభాకర్, రామ్మోహన్, నాగరాజు, మురళి, అనురాధ, చంద్రకళ, అరుణ, హరిత, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ..

అనంతపురం టవర్‌క్లాక్: భారతదేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ పాటుపడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అన్నారు. రాజ్యాంగాన్ని హేళన చేసిన కాంగ్రెస్ పతనమైందన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ దివస్ సందర్భంగా టవర్‌క్లాక్ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నాయకులు చిరంజీవి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రత్నమయ్య, అలాడి రామచంద్రయ్య, జగన్ మోహన్, అశోక్‌రెడ్డి, సాయినాథ్ రెడ్డి, మనోహర్, రాజశేఖర్, దామోదర్, మేఘనాథ్, రామ్ ఆదిత్య, కుళ్ళాయప్ప, శ్రీనాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మాట్లాడుతున్న సీఐ టీ.వి. శ్రీహర్ష

రాప్తాడు: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ టీ.వి. శ్రీహర్ష సూచించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో రహదారి భద్రతపై లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పొట్టకూటి కోసం లారీలు నడుపుతున్న డ్రైవర్లు చేసే చిన్న పొరపాట్ల వల్ల ప్రమాదాలు జరిగితే ఎన్నో కుటుంబాలు అన్యాయమైపోతాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. డ్రైవర్లు అజాగ్రతతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆచార్య తంగిరాల మృతి బాధాకరం

అనంతపురం కల్చరల్: బెంగళూరు యూనివర్సిటీ తెలుగు వ్యవస్థాపకుడిగా సేవలందించిన తంగిరాల వెంకట సుబ్బారావు మరణం తీరని లోటని ప్రముఖ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆయన రాసిన హంసపదిక వంటి కావ్యాలు, వెలుగులోకి తెచ్చిన బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత గాథలు, సంకలనం చేసిన షేక్ నాజర్ బుర్రకథలు ఎంతో మందికి స్ఫూర్తినందించాయని తెలిపారు. అరసం, జిరసం, విమలా శాంతి సాహితీ సాంస్కృతిక సేవా సమితి, సాహిత్య భారతి, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు, తెలుగు వెలుగు సంస్థల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

19 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు ద్వాదశ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అనువంశీక ధర్మకర్త రామ సుబ్రహ్మణ్యం, ఈఓ రమేష్ బాబు తెలిపారు. శనివారం మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి ప్రత్యేకంగా రోజూ ఒక పుష్ప అలంకారంలో పార్వతీ పరమేశ్వరులు దర్శనమిస్తారన్నారు. రోజూ సాయంత్రం సాంస్కృతిక సంబరాలుంటాయని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం రోజున శివపార్వతుల కల్యాణోత్సవం, నిత్య అలంకార సేవలుంటాయని పేర్కొన్నారు. . కార్యక్రమంలో అర్చక బృందం నరసింహ శాస్త్రి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పుణీత ఫ్రాన్సిస్ చాలీసు



ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పుణీత ఫ్రాన్సిస్ చాలీసు (సెయింట్ ఫ్రాన్సిస్ డి.సెయిల్) మహోత్సవాన్ని ప్రిన్సిపల్ ఫాదర్ బొంతూ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ఫాదర్ రవీంద్రా ప్రసాద్, తంబీ హాజరై, మాట్లాడారు. పుణీత ఫ్రాన్సిస్ చాలీసు గొప్ప పుణీతడని.. ఆయన పేరు మీదుగా ఎన్నో పాఠశాలలు, వృద్ధాశ్రమాలు, ప్రింటింగ్ స్కూల్స్ నడుస్తున్నాయన్నారు. గురువులు, సిస్టర్స్ దేశ విదేశాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక, స్కేటింగ్, కరాటే పోటీలు అందరినీ అలరించాయి. కరస్పాండెంట్ బాలసౌరి పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అనంతపురం రూరల్: ప్రస్తుత తరుణంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు అన్నారు. గత రెండు రోజులుగా కళాశాలలో నిర్వహించిన సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక రంగం వైపు మొగ్గు చూపితే మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ప్రస్తుత తరుణంలో సాంకేతిక రంగం ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దిలీప్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

'క్యాట్'లో సత్తా



విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాలల సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన క్యాట్ రెండో రౌండ్ ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటి క్యాష్ అవార్డులు కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నలుగురు రూ.2 వేల క్యాష్ ప్రైజ్, 167 మంది విద్యార్థులు రూ.1000 క్యాష్ ప్రైజ్ సాధించారన్నారు. అలాగే 739 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు, 672 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుమ్, నేత్రావతి, వెంకటేష్, కరీమ్, కో–ఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, నాగభూషణ్, ఇర్షాద్, డీన్లు పాల్గొన్నారు.

పరామర్శ



ముత్యాలప్పను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: అనారోగ్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి మండలం నసనకోట గ్రామానికి చెందిన బోయ ముత్యాలప్పను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ శనివారం పరామర్శించారు. బోయ ముత్యాలప్పకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం బోయ ముత్యాలప్పకు ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా కనగానపల్లి మండలం సోమరవండ్లపల్లి గ్రామానికి చెందిన పాము కాటుకు గురైన జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుబ చిత్ర రవిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెదుదురు గోపాల్ రెడ్డి, చియ్యేడు సర్పంచ్ గంగాధర్ రెడ్డి, పూలకుంట శివారెడ్డి, కుంటిమద్ది రమేష్, అక్కంపల్లి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆధార్ క్యాంపులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఆధార్ క్యాంపులు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. 0–5 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి.. ఆధార్ కార్డులు లేని 46 మంది పిల్లలకు ఆధార్ కార్డులు తీయించినట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డులు లేని పిల్లలకు అంగన్‌వాడీల్లో ఆధార్ కార్డులు చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

• నేడు గణతంత్ర దినోత్సవం

గెలిచిన దారులు మిగిలిన ఆకాంక్షలు

రాజ్యాంగం... దేశ పాలనావ్యవస్థకు పరమగ్రంథం. ప్రతి పౌరునికి శిరోధార్యం. బలహీనులకు వజ్రాయుధం. బలవంతులను అదుపు చేసే అంకుశం. పురుషస్వామ్య పెత్తందారీ నుంచి స్త్రీలు అడుగు ముందుకు వేయడానికి రాజ్యాంగం పరిచిన దారులు వారిని నేడు ఆత్మగౌరవంతో నిలబెట్టి స్వయం సమృద్ధి వైపు నడిపిస్తున్నాయి. సాధించింది ఎంతో. సాధించాల్సింది మరెంతో. ఆకాంక్షలను అలాగే నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని అంటున్నారు సీనియర్ రచయిత్రి.



భారత రాజ్యాంగాన్ని స్త్రీల దృష్టితో చూడటానికి ఈరోజొక వజ్రోత్సవ సందర్భం. వాలుకి కొట్టుకుపోయే యాంత్రికత నుంచి బైటకి వచ్చి, దాటి వచ్చిన కాలాలను, నడుస్తున్న సమయాలను నిమ్మళంగా చూస్తున్నప్పుడు కొంత సంతోషం, మరి కొంత బాధ. ఈ రోజుల్లో భర్త చనిపోతే భార్య చితిలోకి దూకనవసరం లేదు, అతి బాల్య వివాహాలు చేసుకోనవసరం లేదు, వితంతువులు రహస్య గర్భ విచ్ఛిత్తిలో ప్రాణాలు పోగొట్టుకోనవసరం లేదు. గడపచాటున నిలబడి మాట్లాడటం, ముట్టుగదుల్లో మగ్గడం, అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాల నుంచి స్త్రీలు చాలావరకూ బైటపడ్డారు. రాజ్యాంగంలో స్త్రీలకి సమానహక్కులు పొందుపరచడానికి ముందుతరాల వారు చేసిన సంఘసంస్కరణ చాలావరకూ మూలకారణం. దీనికి సమానమైన చేర్పుని రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ ఆలోచనలు ఇచ్చాయి.



స్త్రీలని వాహికలుగా చేసుకుని కులం, మతం వ్యాప్తి చెందుతాయని, ఈ సమాజాన్ని కొందరి చెప్పు చేతుల్లోనే ఉంచుతాయన్నది అంబేద్కర్ అవగాహన. అందుకే దళిత, కార్మికవర్గాల కోసం ఆలోచించినంతగా స్త్రీ సమానత్వం కోసం కూడా పాటుబడ్డారు. రాజ్యాంగానికి మూలాధారమైన 'అందరికీ సమానమైన విలువ' అనే అంబేద్కర్ ప్రతిపాదన పైకి కనిపించే సాధారణ విషయం కాదు. ఆ కాలానికే కాదు, ఇప్పటికీ మనుషులు సమానంగా లేరు. స్త్రీలు చాలా విషయాల్లో రెండవ తరగతి పౌరులుగానే ఉన్నారు. ఆ స్థితిని పోగొట్టి, స్త్రీల జీవితాల్లో విప్లవాత్మక మార్పుల కోసం అంబేద్కర్ ప్రవేశపెట్టిన 'హిందూ కోడ్ బిల్' ఒక సంచలనం. అంతవరకూ స్త్రీలకి సామాజిక, రాజకీయ, కుటుంబహక్కుల వంటివి లేవు. సమానత్వ ప్రాతిపదిక మీద రాజ్యాంగం ద్వారా వారు ఆ హక్కులను మిగతా వారితో పాటు సహజంగానే పొందారు. ఉదాహరణకి రాజ్యాంగ ఏర్పాటుకి మునుపు సార్వత్రిక ఓటుహక్కు లేదు. తొంభైశాతం పైగా స్త్రీలకి ఓటువేయడం అంటే ఏమిటో తెలీదు. కానీ రాజ్యాంగం ద్వారా స్త్రీలంతా ఓటు వేయడమే కాదు, రాజకీయ పార్టీలలో చేరి, ఎన్నికలలో పాల్గొని, శాసనసభలకి చేరారు.

'బిఏ చదివినా బియ్యంలో రాళ్లేరక తప్పుతుందా' అన్నవారికి– ఉద్యోగాలు చేసి, ఊళ్ళేలి చూపించారు స్త్రీలు. బ్రిటిష్ పాలనకి భిన్నంగా భారత రాజ్యాంగం స్త్రీల ఉనికిని నిరూపించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వాడుకుని చేసిన అనేక పోరాటాల ఫలితంగా స్త్రీలకి అనుకూలమైన కొన్ని చట్టాలు రూపొందాయి. వివాహానికి సరైన వయసు ప్రాతిపదిక అయింది. అబార్షన్ హక్కులు ఉన్నాయి. విడాకులు పూర్వమంత కఠినం కావు. స్త్రీలపై సాగే గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలకి కఠినశిక్షలు ఉన్నాయి. ఆస్తి, వారసత్వ హక్కుల విషయంలో కూడా ప్రగతి కనబడుతోంది. ముఖ్యంగా స్త్రీల సామాజిక, రాజకీయ భాగస్వామ్యం మెరుగుబడింది.

అయితే, స్త్రీల హక్కులన్నిటికీ కాపాడగల రక్షణ వ్యవస్థలు నిష్పక్షపాతంగా లేవు. అవి మగ స్వభావాన్ని, మగ పెత్తనాన్ని తెలియక, తెలిసి ప్రదర్శిస్తాయి. దానివల్ల మొగ్గ పురుషుడి వైపు ఉండి స్త్రీ సమానత్వాన్ని సూచించే రాజ్యాంగస్ఫూర్తిని భగ్నం చేస్తాయి. అందుకే 'అందరికీ ఒకే విలువ' సూత్రం ఆచరణలో విఫలం అయింది. స్త్రీలు అన్ని ఉద్యోగాలకి అర్హులు. కానీ సైనికులుగా, భారీ వాహన చోదకులుగా, పెద్దపెద్ద హోదాలు కల ఉద్యోగులుగా, మంత్రులుగా, వ్యాపారవేత్తలుగా వారి ఉనికి ఎంత? ఇటీవలి అంచనాలు కార్మిక వర్గంలో, 'బాస్' స్థానాలలో స్త్రీల నిష్పత్తి పతనమవుతున్నదని హెచ్చరిస్తున్నాయి. ఇక కొన్ని ప్రత్యేక రంగాల్లో స్త్రీలు అడుగు పెట్టాల్సే ఉంది.

సంసిద్ధత లేకపోవడం సమాజానికే కాదు, సమాజం తయారు చేసే స్త్రీలది కూడా కావొచ్చు. అందరినీ ఒక చోటికి చేర్చాలంటే వెనుకబడి ఉన్న వారిని ముందుకు చేర్చడానికి రిజర్వేషన్లు కావాలి. విద్యా ఉద్యోగ రంగాలలో స్త్రీలకి 33 శాతం రిజర్వేషన్లని అంగీకరించిన రాజ్యాంగం– చట్టసభలకి ఆ హక్కుని వర్తింపజేయలేక పోయింది. 33 శాతం రిజర్వుడ్ స్థానాల్లోనూ, జనరల్ స్థానాల్లో మరి కొందరు స్త్రీలు కలిసి చట్టసభలకి చేరి విధాన నిర్ణయాలు చేయడమన్న ఆలోచనకే రాజకీయపార్టీలు వ్యతిరేకం కనుకనే ఇంతవరకూ మహిళా రిజర్వేషన్ల బిల్లు ముందుకు పోవడం లేదు. స్త్రీల శరీరాల మీద పురుషులకి ఉండే హక్కులకి, స్త్రీల గౌరవానికి భంగకరంగా ఉన్న అడల్టరీ చట్టం ఎత్తి వేయడానికి రాజ్యాంగం ఏర్పడ్డాక కూడా దాదాపు ఏడు దశాబ్దాలు పట్టింది. తల్లికి బిడ్డల మీద ఉండాల్సిన సహజ బాధ్యతలు, హక్కుల విషయంలో కూడా చాలా వివక్ష ఇప్పటికీ ఉంది. పురుషుని ఇంటిపేరుతో స్త్రీ, ఆమె పిల్లలు గుర్తింపు పొందడం– పితృస్వామ్యం బలంగా ఉండడాన్నే సూచిస్తుంది.

రాజ్యాంగంలో కూడా స్త్రీలహక్కులకి సంబంధించి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆచరణలో చాలా లోటుపాట్లు కూడా ఉన్నాయి. అయినాసరే స్త్రీలు తాము పోరాడి సాధించుకున్న చైతన్యాన్ని నిలుపుకోవడానికి తమ హక్కులకి రక్షణ ఉండాలని గట్టిగా అడగడానికి రాజ్యాంగమే ఆసరాగా ఉంది. దానికి తోడు మహిళాపోరాటాల సాధించుకున్న, సాధించుకోబోయే మార్పులు– 'అందరికీ ఒకే విలువ' సూత్రానికి స్త్రీలని మరింత దగ్గర చేస్తాయని నమ్మిక. ఈ నమ్మకాన్ని సడలనివ్వకుండా మనం ముందుకు సాగాలి.

– కె.ఎన్.మల్లీశ్వరి, రచయిత

"సన్నగా ఉండాలని కడుపు మాడ్చుకుంటే అనారోగ్యమే. చక్కగా తినాలి... చక్కగా ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ఆరోగ్యమే మహాభాగ్యం" అని **ఉష మూల్పూరి** అన్నారు. నిర్మాతగా తన తనయుడు నాగశౌర్యతో 'ఛలో, నర్తనశాల, కృష్ణా వ్రింద విహారి' తదితర చిత్రాలను నిర్మించారు. తొలి చిత్రం 'ఛలో' తోనే నిర్మాతగా సక్సెస్‌ని టేస్ట్ చేసిన ఉష ఇప్పుడు తన రెస్టారెంట్ 'ఉష మూల్పూరి'స్ కిచెన్' ద్వారా రుచికరమైన వంటకాలు అందిస్తున్నారు. ఇక గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కోసం ప్రత్యేకంగా కొన్ని వంటకాలు తయారు చేశారు. ఆ వంటకాలు తెలుసుకుందాం.

సర్వ ఆహార సమ్మేళనం



ఉష మూల్పూరి

"దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్... ఆ మనుషుల ఆరోగ్యం మా బాధ్యత... అందుకే రిపబ్లిక్ డే సందర్భంగా చేసిన వంటకాల్లోనూ పోషక విలువలు ఉండేలా చూసుకున్నాను'' అంటూ దేశభక్తిని చాటుతూ, జెండా రంగులకు తగ్గట్టుగా తాను కూడా రెడీ అయి, కిచెన్‌లోకి ఎంటర య్యారు ఉష. ముందుగా నాన్ వెజ్ స్టార్టర్ చేశారు.. 'పండుమిర్చి కోడి వేపుడు, క్రీమ్ చికెన్, కరివేపాకు కోడి వేపుడు' చేసి, ఆ కాంబోని అందంగా ప్రెజెంట్ చేశారు.



"పండు మిర్చిలో విటమిన్ ఎ, బి, సి వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే క్యాన్సర్‌తో పోరాడే ఔషధ గుణాలు ఉంటాయి. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ వంటివి ఉంటాయి. కంటికి, జుట్టుకి మంచిది. ఎముకల ఆరోగ్యానికి కూడా కరివేపాకు బెస్ట్. అందుకే ఆహారం ఆరంభమే ఆరోగ్యంగా ఆరంభించాలని ఈ స్టార్టర్స్ చేశాను'' అని వివరించారు ఉష. రైస్ ఐటమ్స్‌లో పుదీనా మాంసం పులావ్, చికెన్ ఫ్రైడ్ రైస్, పండు మిర్చి కోడి పులావ్ చేశారు. "పుదీనాకి మంచి వాసన ఉంటుంది. దాంతో పాటు రుచి కూడా బాగుంటుంది. అలాగే ఆహారం జీర్ణం కావడానికి పుదీనా మంచిది. ఐరన్ పుష్కలంగా ఉన్న పుదీనాని మీరు రోజూ తీసుకోవచ్చు. మనలో చాలామందికి రోజూ టీ తాగే అలవాటు ఉంటుంది. ఆ టీలో కొన్ని పుదీనా ఆకులు వేసుకుని, తాగి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. ఇక నాన్‌వెజ్ తినేవారికి చికెన్‌లో ఎన్ని పోషక పదార్థాలు ఉన్నాయో తెలిసిందే'' అని పేర్కొన్నారామె. మాంసాహారం మాత్రమే కాదు... శాకాహారం కూడా చేశారు ఉష. వెజ్‌లో కరివేపాకు వెజ్ పులావ్, పండుమిర్చి పనీర్ పలావ్, కర్డ్ రైస్ చేశారు. "కరివేపాకు, పండుమిర్చి ఎంత మంచిదో ముందే చెప్పాను. పనీర్ మంచి ప్రొటీన్ ఫుడ్. నాన్‌వెజ్ తినేవారికి మాంసం రూపంలో ప్రొటీన్లు అందుతాయి. వెజిటేరియన్స్‌కి పనీర్ బెస్ట్. పనీర్‌లో తక్కువ కార్బోహైడ్రేట్స్... ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. ఇక మన ఇండియన్స్‌లో చాలా మందికి ఫైనల్‌గా పెరుగన్నం తింటేనే సంతృప్తిగా ఉంటుంది.



పెరుగులో కావాల్సినంత కాల్షియం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పొట్ట చల్లగా ఉండటానికి పెరుగన్నం కూడా చేశాను'' అని తెలిపారు ఉష మూల్పూరి.

ఎనిమిది పదుల వయసులవాళ్లకూ...

"మనం ఆహారం తీసుకున్నాక పొట్ట బరువుగా ఉండకూడదు. తేలికగా అనిపించాలి. ఫుడ్ బిజినెస్ ఆరంభించాలనుకున్నప్పుడు నా మెయిన్ టార్గెట్ ఇదే. మా రెస్టారెంట్‌కి ఎనభై ఏళ్ల వయసు, ఆ పైన ఉన్నవాళ్లు కూడా వస్తారు. 'పొట్ట చాలా తేలికగా ఉందమ్మా' అని వారు చెప్పినప్పుడు హ్యాపీగా ఉంటుంది'' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు.

సెలబ్రిటీలకూ...

"మా కిచెన్ వంటకాలను ఎన్టీఆర్, రామ్ చరణ్, ఉపాసన, కృష్ణారెడ్డి, హరీష్ శంకర్, బాబీ, బుచ్చిబాబు, కోటి, మెగా కృష్ణారెడ్డి, నందినీ రెడ్డిగార్లు వంటివారు ఇష్టపడతారు. మా దగ్గర బ్రొకోలీ కాషూనట్ చిల్లీ గార్లిక్ ఫేమస్. ఇవి ఎక్కువగా తెప్పించుకుంటారు'' అని చెప్పారు ఉష.

అవగాహన పెంచుకోవాలి

"నేను రెస్టారెంట్ పెట్టాలనుకున్నప్పుడు నాకు పెద్దగా ఏమీ తెలియదు. జీతాలిచ్చి మనుషులను పెట్టుకుని, వాళ్లతో చేయించేయొచ్చు. కానీ అందులో పరిపూర్ణత ఉండదు. వంటకు కావల్సినవి కొనడం నుంచి వాటిని సరిగ్గా శుభ్రం చేసి వండటం వరకూ అన్నింటినీ దగ్గరుండి చేయించేదాన్ని. 'సర్వమత సమ్మేళనం' అంటారు... 'సర్వ ఆహారం సమ్మేళనం' అంటాను. రెస్టారెంట్ అంటే రకరకాల వాళ్లు వస్తారు. వాళ్లకి తగ్గట్టుగా ఉండాలి కదా. నా కుటుంబ సభ్యులకు వండుతున్నట్లుగా భావించి వంట చేయిస్తాను. వీలున్నప్పుడల్లా అన్ని టేబుల్స్ దగ్గరికి వెళ్లి, అందర్నీ పలకరిస్తుంటాను. 'మాకు ఇంటికి వచ్చినట్లుగా ఉంది' అని అంటుంటారు. అందరికీ 'సాక్షి' ద్వారా థ్యాంక్స్ చెబుతున్నాను'' అంటూ ముగించారు ఉష.

– డి.జి. భవాని

హెల్త్

• టీన్- అనీమియా

ఆ టైమ్ లోనూ ఐరన్ యువతిలా...



భారతదేశంలోని మహిళల్లో రక్తహీనత (అనీమియా) చాలా ఎక్కువ. కొన్నేళ్ల కిందట దాదాపు 85 శాతం మంది మహిళలు అనిమిక్‌గా ఉండేవారు. క్రమంగా మహిళల్లోనూ చైతన్యం పెరుగుతుండటంతో ఇటీవల అది 57 శాతానికి చేరింది. ఇంతగా చైతన్యం పెరిగాక కూడా దేశంలోని సగానికి పైగా మహిళలు అనీమియాతో బాధపడుతున్నారు. ఇక ఇటీవలే పీరియడ్స్ మొదలైన టీనేజీ అమ్మాయిల్లో రక్తహీనతతో బాధపడుతుండేవారు ఇంకా ఎక్కువ. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019–21 ప్రకారం 15 నుంచి 19 ఏళ్ల వయసుండే కౌమార బాలికల్లో అనీమియాతో బాధపడేవారు 59.1 శాతం! రుతుస్రావంలో రక్తం కోల్పోతుండటం, అది భర్తీ అవుతుండగానే నెలసరితో రక్తం కోల్పోతుండటంతో యువతుల్లో రక్తహీనత కనిపిస్తోంది.

కొత్తగా పీరియడ్స్ మొదలైన టీనేజ్ అమ్మాయిలు అనీమియాకు లోనుకాకుండా ఉండాలంటే ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకుంటూ ఉండాలి. అవేమిటో చూద్దాం.

ఆహారంలో ఎక్కువగా తీసుకోవాల్సినవి...

• శాకాహారులు తమ ఆహారంలో తాజాగా ఉండే ఆకుకూరలు, ఎండు ఖర్జూరం, నువ్వులు, బెల్లం (బెల్లం, నువ్వులు ఉండే నువ్వుల జీడీలు, బెల్లం, వేయించిన వేరుశనగలు ఉండే పల్లీపట్టీలు తీసుకోవడం మేలు), గసగసాలు, అటుకులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. • ఒకవేళ మాంసాహారులైతే ఆహారంలో వేటమాంసం, చేపలు, చికెన్‌తో పాటు... మటన్, చికెన్ లివర్‌ను ప్రత్యేకంగా తీసుకోవడం మంచిది.

• మాంసాహారం, శాకాహారం ఈ రెండింటిలోనూ ఐరన్ ఉంటుంది. అయితే మాంసాహారంలో హీమ్ ఐరన్ ఉంటుంది. హీమ్ ఐరన్ అంటే... తిన్న వెంటనే అది ఒంటికి పట్టే రూపంలో ఉంటుంది. అదే శాకాహార పదార్థాల్లో ఉండే నాన్‌హీమ్ ఐరన్ ఒంటికి పట్టేలా చేయడానికి విటమిన్–సి కావాలి. కాబట్టి శాకాహారులు తమ ఆహారాల్లో ఐరన్ ఉండేవి తినేటప్పుడు వాటితో పాటు విటమిన్–సి ఉండే తాజా పండ్లైన జామ, నిమ్మ, నారింజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి లేదా వంటకాల్లో విటమిన్–సీ ఎక్కువగా ఉండే ఉసిరి వంటివి తీసుకుంటూ ఉండాలి.

• మాంసాహారులైనా, శాకాహారులైనా కోడిగుడ్డు, పాలు తప్పనిసరిగా రోజూ తీసుకోవాలి. కోడిగుడ్డులో పచ్చసొన తీసుకోకూడదనే అభిప్రాయాన్ని వదిలించుకోవాలి. ఎందుకంటే పచ్చసొనతో వచ్చే హానికరమైన కొలెస్ట్రాల్ కంటే, అది తీసుకోకపోతే కోల్పోయే పోషకాలే ఎక్కువ.

• రుతుస్రావం అవుతున్న సమయంలో ద్రవాహారం సమృద్ధిగా లభించేలా ఎక్కువ నీళ్లు తాగుతూ, కొబ్బరినీళ్లు తీసుకోవడం కూడా మంచిదే.

అస్సలు తీసుకోకూడనివి...

• బేకరీ ఐటమ్స్, కెఫిన్ మోతాదు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్ అస్సలు తీసుకోకూడదు.

చాలా పరిమితంగా తీసుకోవాల్సినవి...

• ఉప్పు ఎక్కువగా ఉండే పచ్చళ్లు, అప్పడాలు వంటి వాటినీ, కొవ్వులు ఉండే ఆహారాలను చాలా పరిమితంగా తీసుకోవాలి. • కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ చాలా తక్కువగా తీసుకోవాలి.

మరికొన్ని సూచనలు

• రుతుస్రావం సమయంలో అమ్మాయిలు రక్తాన్ని ఎక్కువగా కోల్పోతుంటారు కాబట్టి ఎక్కువ మోతాదులో ఆహారం ఇవ్వాలంటూ పొరుగువారు, ఫ్రెండ్స్ చెబుతుంటారు. అది వాస్తవం కాదు. ఈ టీనేజీలోనే అమ్మాయిలు తాము తీసుకునే క్యాలరీల వల్ల బరువు పెరుగుతుంటారు. అందుకే ఆహారం ఎక్కువగా తీసుకోవడం కంటే... ఆహారాన్ని ఎప్పటిలాగే తీసుకుంటూ ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలూ తీసుకోవాలి.

• కొత్తగా రుతుస్రావం మొదలైన అమ్మాయిలకు కొబ్బరి, బెల్లం పెట్టాలంటారు. సంప్రదాయకంగా పెద్దలు చెప్పే ఆ ఆహారం పెట్టినా పరవాలేదు. అయితే కొబ్బరిలో, నువ్వుల్లో కొవ్వు పదార్థాలు ఎక్కువ. కాబట్టి వాటిని కాస్త పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. • నెయ్యికి బదులు వెన్న వాడటం మేలు. ఎందుకంటే వెన్నకాచి నెయ్యి చేశాక అందులో కొన్ని పోషకాలు తగ్గుతాయి. అయితే వెన్న తీసుకుంటే అందులోని కొవ్వులు... ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్స్‌ను బాగా ఒంటబట్టేలా చేస్తాయి. • అన్నిటి కంటే ముఖ్యంగా పీరియడ్స్ సమయంలోనూ తేలికపాటి వ్యాయామం చేయడం అవసరమని తెలుసుకోవాలి. క్రమం తప్పకుండా రోజుకు 45 నిమిషాల చొప్పున కనీసం వారానికి ఐదు రోజుల పాటైనా వ్యాయామం చేస్తే హార్మోన్లు క్రమబద్ధంగా విడుదల కావడం జరుగుతోంది. అయితే కొంతమంది విషయంలో మాత్రం పీరియడ్స్ సమయంలో వ్యాయామం కుదరకపోవచ్చు. వాళ్ల మినహా మిగతా యువతులంతా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.



డా. పూజితాదేవి సూరనేని
సీనియర్ హైరిస్క్ ఆబ్‌స్టెట్రీషియన్ & రోబోటిక్ సర్జన్

• నీ రిప్లేస్‌మెంట్ - రోబో

సునిశితంగా శస్త్ర చికిత్స



మోకాలి ఎముకల తాలూకు మృదులాస్థి (కార్టిలేజ్) అరిగాక... మోకాలి కదలికల్లో ఒకదానితో మరొకటి ఒరుసుకుంటే తీవ్రమైన నొప్పి రావడం... ఈ అరుగుదల తీవ్రత నాలుగో దశకు చేరాక మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అవసరం ఏర్పడటం అందరికీ తెలిసిందే. ఇప్పటివరకు సంప్రదాయ పద్ధతుల్లో చేసే నీ రీప్లేస్‌మెంట్ చికిత్సల స్థానంలో ఇప్పుడు రోబో సహాయంతో శస్త్రచికిత్స (రోబోటిక్ సర్జరీ) వంటి అధునాతన పద్ధతులు అమల్లోకొచ్చాయి. ఈ నేపథ్యంలో రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీతో ఉండే సౌలభ్యాలూ, అనుకూలత గురించి తెలుసుకుందాం.

మోకాలి ఎముకల అరుగుదల అనేక విధాలుగా జరుగుతుంది. ఈ అరుగుదలను ఆర్థరైటిస్‌గా పేర్కొంటారు. ఇందులో దశలు ఉంటాయి. ఒకదశ దాటాక (నాలుగో దశ) ఇక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స వల్లనే నొప్పి తగ్గుతుంది. గతంలోనూ... ఆ మాటకొస్తే ఇప్పుడు కూడా సాధారణ సంప్రదాయ పద్ధతుల్లో శస్త్రచికిత్సలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇటీవల అనేక శస్త్రచికిత్స పద్ధతుల్లో వచ్చినట్టే మోకాలి మార్పిడి చికిత్సల్లో సైతం రోబోటిక్ సర్జరీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందునా ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో పని చేస్తూ... అత్యంత సునిశితంగా (ప్రెసిషన్‌తో) శస్త్రచికిత్స చేయగల సామర్థ్యం ఉన్న అత్యాధునిక రోబోల సహాయాన్ని వైద్యులు తీసుకుంటున్నారు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే ఈ అధునాతన పద్ధతిలో జరిగే శస్త్రచికిత్సతో ప్రయోజనాలేమిటో చూద్దాం.

• **కృత్రిమ పరికరాలు చాలాకాలం పాటు మన్నడం:** లోపల అమర్చాల్సిన పరికరాలను చాలా సునిశితత్వంతో అత్యంత ఖచ్చితమైన స్థానాల్లో అమర్చడం వల్ల అవి త్వరగా రాసుకుపోవడం, ఒరుసుకుపోవడం జరగవు. దాంతో చాలాకాలం పాటు మన్నికతో ఉంటాయి.

• **తక్కువ నొప్పి:** రోబోటిక్ శస్త్రచికిత్సలో నొప్పి చాలా తక్కువగా ఉంటుంది.

• **చాలా తక్కువ దుష్ప్రభావాలు:** చాలా ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స జరిగిపోవడం వల్ల ఇన్ఫెక్షన్ వంటి దుష్ప్రభావాలు రావడం చాలా తక్కువ.

• **టైలర్ సర్జికల్ అప్రోచ్:** అందరి దేహ భాగాలూ, వాటితో పనిచేసే తీరు తెన్నులు ఒకేలా ఉండవు. దాంతో బాధితుల మోకాలి చుట్టూ ఉండే టెండన్లు, లిగమెంట్లు సరిగ్గా అమరిపోయేలా వారి అవసరాలకు తగ్గట్లుగా కృత్రిమ ఉపకరణాల రూపకల్పన, లోపల వాటి అమరిక అత్యంత ఖచ్చితత్వంతో జరగడంతో గతంలోని వారి వ్యక్తిగత అవయవం లాగానే మోకాలి భాగాలు అమరిపోతాయి. ఇంకా చెప్పాలంటే

మరింత ఎక్కువ సునిశితత్వం

ఇలాంటి అత్యాధునిక రోబోల సహాయంతో చేసే శస్త్రచికిత్సలో సర్జన్‌ల ముందర బాధితుల తాలూకు మోకాలి 3–డి ఇమేజ్ స్పష్టంగా కనిపిస్తుంటుంది. సంప్రదాయ చికిత్సల్లో ఇది అంత పూర్తిగా, స్పష్టంగా కనిపించకపోవచ్చు. ఫలితంగా కృత్రిమ మోకాలి ఎముకల భాగాల్ని అమర్చేటప్పుడు మునుపు ఉన్నట్లే సరిగ్గా అమరిపోయేలా అమర్చడానికి వీలవుతుంది.

వేగంగా కోలుకోవడం

రోబోటిక్ శస్త్రచికిత్స అత్యంత సునిశితత్వంతో జరగడంతో గాయం చాలా త్వరగా తగ్గుతుంది. ఇక దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) కూడా చాలా తక్కువగా ఉండటం ఫలితంగా చాలా వేగంగా కోలుకుని, చాలా త్వరగా ఇంటికెళతారు.



సంప్రదాయ చికిత్సలో శస్త్రచికిత్స చేసి లోపలి భాగాలను చూసేవరకు కండరాల పరిస్థితి అంతగా తెలియదు. అనుభవజ్ఞులైన శస్త్రచికిత్స నిపుణులు తమ అంచనా ప్రకారం శస్త్రచికిత్స నిర్వహిస్తారు. అయితే రోబోటిక్ సర్జరీలో కండరాల తీరుతెన్నులు శస్త్రచికిత్స ముందే స్పష్టంగా తెలుస్తాయి. ఫలితంగా ఖచ్చితమైన శస్త్రచికిత్సకు అవకాశం దొరుకుతుంది. దాంతో శస్త్రచికిత్స తర్వాత మోకాలు ముందుకూ వెనక్కు కదలడం (ఎక్స్‌టెన్షన్, ఫ్లెక్షన్) వంటి కదలికలు చాలా బాగుంటాయి. అందునా మోకాలి దగ్గర వంగడం అనేది సంప్రదాయ చికిత్స కంటే మరింత ఎక్కువగా ఉంటుంది. బాగుంటుంది. మోకాలు ఒంచేటప్పుడు సైతం నొప్పి చాలా తక్కువ.



డా. నీలం రమణారెడ్డి,
రోబోటిక్
నీ రీప్లేస్‌మెంట్ సర్జన్

ఎవరికి ఈ శస్త్రచికిత్సలు

గతంలో శస్త్ర చికిత్స చేయించుకుని విఫలమైనవాళ్లు (వీళ్లలో మోకాలి దగ్గర కదలికలు చాలా పరిమితంగా ఉండటం, కాలు కదిలిస్తున్నప్పుడు నొప్పి ఉండటం వంటి లక్షణాలుంటాయి), అరుగుదల చాలా ఎక్కువగా (సివియర్ ఆస్టియో ఆర్థరైటిస్) ఉన్నవారికి, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతుండేవారికి, అలాగే ఇక నొప్పి నివారణ మందులూ, ఇతర చికిత్సలు పని చేయని వారికి ఈ రోబోటిక్ శస్త్రచికిత్స ఎంతగానో ఉపయోగపడుతుంది.